క్లుప్తంగా

ఆశావర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు

పుట్టపర్తి అర్బన్: ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్ల సంఘం గౌరవాధ్యక్షురాలు సాంబశివ, జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య తదితరులు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, దహన సంస్కారాల కోసం రూ.20 వేలు చెల్లించాలని, 5జీ సిమ్‌లు అందించాలని, పని భారం తగ్గించాలని, కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాధా, ముంతాజ్, శబరి, రమాదేవి ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు ప్రారంభం

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటగా మండలంలో సాగు చేసిన వేరుశనగలో దిగుబడి అంచనా కోసం అధికారులు సోమవారం పంటకోత ప్రయోగాలు ప్రారంభించారు. దంపెట్ల రెవెన్యూ గ్రామంలో చేపట్టిన పంటకోత ప్రయోగాల్లో 3.640 కిలోల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయ ఉపగణాంక అధికారి ఎస్.గోపాల్ పర్యవేక్షణలో ఏఈఓ శ్రీనివాసులు ప్రయోగాలు నిర్వహించారు. కార్యక్రమంలో బత్తలపల్లి ఏఎస్ఓ డాక్టర్ కేఎస్ లక్ష్మీనరసింహ శర్మ, వీఏఏ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీఈఓ రవికుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



ధర్మవరంలో వడ్డె ఓబన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


ధర్మవరం అర్బన్: స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 179వ వర్ధంతి సోమవారం ధర్మవరంలో ఘనంగా నిర్వహించారు. సెరికల్చర్ కార్యాలయం దగ్గరున్న వడ్డే ఓబన్న విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం నాయకులు దేరంగుల అంజి, మంజుల నరేంద్ర మాట్లాడుతూ తొలి స్వాతంత్య్ర సమరయోధుడు ఓబన్న బ్రిటీష్ పాలకులపై వీరోచితంగా పోరాడారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో వడ్డెర్లు నడవాలని సూచించారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం నాయకులు మల్లెల దివాకర్, నారాయణస్వామి, సుధాకర్, సూర్యనారాయణ, శేషు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: రేనాటి వీరుడు, స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డే ఓబన్నకు వడ్డెర నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం బత్తలపల్లి, వెంకటగారిపల్లి, కట్టకిందపల్లిలో వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు కట్టకిందపల్లి మంజుల రమణ, బత్తలపల్లిలో గోగుల సన్నపెద్దన్న, రాజు, ప్రసాద్, సంజీవరాయుడు, మంజు, వెంకటగారిపల్లిలో డీలర్ ఆదెప్ప, వెంకటరాముడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత

పుట్టపర్తి అర్బన్: వన్య ప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యతని బుక్కపట్నం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంద్రానాయక్ తెలిపారు. సోమవారం పుట్టపర్తి మండలం పెడపల్లి ఉన్నత పాఠశాలలో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకొని వన్యప్రాణుల రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా వన్య ప్రాణులను బంధించినా, వేటాడినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వన్యప్రాణులను రక్షించడం ద్వారా ప్రకృతి, పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు చిన్నప్పయ్య, రామిక్రిష్ణ, గంగాధర్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి



మాట్లాడుతున్న అగిలే శంకర్‌రెడ్డి

తాడిమర్రి: వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేస్తామని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అగిలే శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన కార్యకర్తలతో కలిసి తాడిమర్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర కమిటీలో సంయుక్త కార్యదర్శిగా తనను నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు బాలిరెడ్డి, ఓబిరెడ్డి, పీరా, ముత్తు పాల్గొన్నారు.

ఛిద్రమైన గ్రామీణ రోడ్లు

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే హడావుడిగా కొన్నిచోట్ల గుంతలు పూడ్చారు. అయితే అవన్నీ పైపూత పనులు కావడంతో కొద్ది రోజులకే రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. కనగానపల్లి మండలంలో ధర్మవరం నుంచి కనగానపల్లికి వెళ్లే ప్రధాన రహదారి ఛిద్రమైపోయింది. ఈ రహదారిలో రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన ప్యాచ్‌వర్క్ పనులు నాణ్యత లేకపోవడంతో ఆరు నెలలకే రోడ్డు దెబ్బతింది. ఇక కనగానపల్లి– ముత్తువకుంట్ల, కనగానపల్లి– యలకుంట్ల, తగరకుంట– నరసంపల్లి రహదారులు గుంతలు పడ్డాయి. ఈ రహదారుల్లో ప్రయాణం ఇబ్బందికరంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు.



ఛిద్రమైన కనగానపల్లి- ధర్మవరం రహదారి



గుంతలమయంగా మారిన కనగానల్లి- ముత్తువకుంట్ల రోడ్డు



మలమీదపల్లి - సామచేనుబైలు రోడ్డులో మొక్కలు ఇలా..

దారిని కప్పేస్తున్న మొక్కలు

గాండ్లపెంట: మండలంలోని పలు మలుపుల వద్ద మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. మలమీదపల్లి నుంచి సామచేనుబైలుకు వెళ్లే రోడ్డు, సోమయాజుపల్లి పంచాయతీ యర్రజేనుపల్లి వద్ద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెరిగాయి. ఇక్కడ మలుపులు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అడ్డంగా ఉన్న మొక్కలు తొలగించి..



యర్రజేనుపల్లి - గాండ్లపెంట రోడ్డులో మలుపు వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

భవానీశంకర్ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న జ్యోతి లింగం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని భవానీశంకర్ స్వామి, ఓంకారనాథ జ్యోతి లింగానికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు.

అయ్యప్ప భక్తమండలి అధ్యక్షుడిగా వేణుగోపాల్



వేణుగోపాల్

చెన్నేకొత్తపల్లి: అఖిల భారత అయ్యప్ప భక్త మండలి సంఘం మండల అధ్యక్షుడిగా బిల్లే వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు మండలి జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



భారతీరెడ్డి

పుట్టపర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశాయి భారతీరెడ్డి తెలిపారు. తన సేవలు గుర్తించి రాష్ట్రస్థాయి పదవి ఇచ్చినందుకు మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ మిథున్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న దొడ్డెప్ప

కదిరి అర్బన్: బూరుగుపల్లి గ్రీన్ అంబాసిడర్ దొడ్డెప్ప సోమవారం విజయవాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్వచ్ఛతా హీ సేవ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణలో దొడ్డెప్ప చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డు ఇచ్చింది.

మినీ అంగన్‌వాడీ కార్యకర్తకు అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీదేవి

ముదిగుబ్బ: ఉప్పలపాడు మినీ అంగన్‌వాడీ కార్యకర్త జి.శ్రీదేవి సోమవారం కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' అవార్డు అందుకున్నారు. పుట్టపర్తిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే సింధూరరెడ్డి చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు.

ప్రయాణికులకు నిలువ నీడ కరువాయె



బస్సుల కోసం రోడ్డుపైనే వేచి ఉన్న ప్రయాణికులు



మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్

ఎన్పీకుంట: మండల కేంద్రం ఎన్పీకుంటలో ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. బస్టాండ్ సెంటర్లో షెల్టర్ లేకపోవడంతో రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. రోజూ ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణాలు చేస్తుంటారు. గతంలో బస్టాండ్ సెంటర్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసినా అక్కడ బస్సులు నిలిపే సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీనికి తోడు ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించక పోవడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. బస్టాండ్ ప్రాంతంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్టాండ్ సెంటర్లో ఉన్న బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి, బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, షెడ్యూల్ ప్రకారం బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పుట్టపర్తి టౌన్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యాలు బాగుంటాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం ఎనుములపల్లి సమీపంలో ఉన్న శిల్పారామంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డితో కలిసి మంత్రి, కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళర్పించారు. అనంతరం ఆరోగ్య శాఖ వారు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లను పరిశీలించారు. అనంతరం 47 మందికి జిల్లాస్థాయి అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అవార్డు గ్రహీతల సేవలు ఎనలేనివని కొనియాడారు. కలెక్టర్ మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో రెండు రాష్ట్రస్థాయి, 47 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ మానేయాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛత కార్పొరేషన్ డైరెక్టర్లు పర్వీన్‌బాను, మంజునాథరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ప్రజప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.



అవార్డులు ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోండి

కనగానపల్లి: కేంద్రం ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముక్తాపురం సచివాలయ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం ముక్తాపురం గ్రామంలో జీఎస్టీ తగ్గింపుపై స్థానిక సచివాలయ, ఆర్ఎస్‌కే సిబ్బంది ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు, పనిముట్లపై తగ్గిన పన్నుల శాతం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ త్రినాథ్, ఎంపీఈఓ నరేష్, వెలుగు సీసీ చంద్ర, డీలర్ నారాయణ స్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జీఎస్టీపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ డి.స్మిత అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు, స్లాబుల గురించి అర్థశాస్త్ర అధ్యాపకుడు శంకర్ వివరించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ, ఆర్ఎస్‌కే సిబ్బంది

వాటర్ ప్లాంట్ వితరణ

నల్లమాడ: మలేషియాకు చెందిన సత్యసాయి భక్తులు బొగ్గలపల్లికి వాటర్ ప్లాంట్ వితరణ చేశారు. సత్యసాయి భక్తులు మహేంద్రన్, సత్యసాయి సేవాసంస్థల నేషనల్ సేవా కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, శ్రీబాబ్, గీల సోమవారం వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గ్రామానికి చెందిన మోపూరి సురేష్ సమకూర్చారు.

యువకుడికి తీవ్ర గాయాలు

తనకల్లు: కొక్కంటిక్రాస్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ముళ్లోళ్లపల్లికి చెందిన చంద్రశేఖర్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై కొక్కంటిక్రాస్‌కు బయల్దేరాడు. మూడు రోడ్ల కూడలిలో బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌పై పడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు మనోజ్ నాయుడు, తండేల్, కార్తీక్ తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు.

శిలాఫలకం ఆవిష్కరణ

నల్లచెరువు: ఉబిచర్ల పంచాయతీలోని గోరంట్లవారిపల్లిలో సోషల్ యాక్టివిటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎంపీడీఓ రామక్రిష్ణ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ క్రాంతి, జిల్లా కమ్యూనిటీ ఆర్గనైజర్ విశ్వేశ్వర, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఖరీదైన ఖరము పాలు



గాడిదలను తీసుకెళ్తున్న యువకులు

చెన్నేకొత్తపల్లి: 'గంగిగోవు పాలు గరిటెడైనను చాలు.. కడివెడైననేమి ఖరము పాలు' అంటూ అపుడెపుడో వేమన చెప్పాడు. కానీ ఇప్పుడు అదికాస్త తిరగడి 'గరిటెడైనను చాలు ఖరము పాలు' అంటున్నారు. సోమవారం చెన్నేకొత్తపల్లిలో ఇద్దరు యువకులు రెండు గాడిదలను వెంట బెట్టుకొని వీధుల వెంబడి తిరుగూ పాలు విక్రయించారు. చిన్న గ్లాసు పాలకు రూ.100 వసూలు చేశారు. గాడిద పాలు తాగితే రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు ఎముకలు బలంగా ఉంటాయని, చర్మం నిగనిగలాడుతుందన్న పెద్దల మాటలతో అందరూ తమ పిల్లలకు గాడిద పాలు తాగించేందుకు ఉత్సాహం చూపారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

నల్లచెరువు: ఉపాధి హామీ సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా ఏపీడీ శకుంతల హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఏపీడీ మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ఎఫ్ఏలు, టీఏలు పనులను గుర్తించి, కూలీల సంఖ్య పెంచే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మంజునాథ, ఈసీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తాడిమర్రిలో పరుష

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రిలో మంగళవారం నుంచి రెండురోజులపాటు ఆర్వేటప్ప స్వామి, పెద్దమ్మ, యల్లమ్మల పరుష జరగనుంది. కురుబ సామాజిక వర్గానికి చెందిన ఆర్వేటప్ప గుడికట్టుదారులు కోనేరుబావి సమీపంలో పరుషకు ఏర్పాట్లు చేశారు. సమాచారం అందుకున్న ఆర్డీఓ మహేష్, డీఎస్పీ హేమంత్ కుమార్ సోమవారం పరుష జరిగే ప్రాంతాన్ని సందర్శించారు. పరుష నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మొదటి రోజు మంగళవారం పరుషకు వచ్చే పలు దేవతల విగ్రహాలను శ్రీలక్ష్మీచెన్నకేశ్వస్వామి ఆలయం వద్ద విడిది చేయించి, అక్కడ నుంచి శివాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రెండో రోజు బుధవారం తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం హెలికాప్టర్‌తో దేవతామూర్తులపై పూలు చల్లిస్తామని వివరించారు. అధికారులు మాట్లాడుతూ గొడవలు లేకుండా ప్రశాంతంగా పరుష జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.



పరుష ఏర్పాట్లను తెలుసుకుంటున్న డీఎస్పీ హేమంత్ కుమార్

'ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే ఊరుకోం'

పుట్టపర్తి టౌన్: ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే ఊరుకునేది లేదని బంజారా సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు హెచ్చరించారు. సోమవారం పుట్టపర్తిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల తలరాతలు మారడం లేదన్నారు. ఎంతోమంది గిరిజన బిడ్డలు ఉన్నత చదువులు చదవలేక, ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గిరిజనులకు నష్టం కలిగించే విధంగా ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గిరిజనుల 23 డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ నెల 12న పుట్టపర్తి మండలం జగరాజుపల్లివద్ద బంజారా సేవా సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న సమావేశానికి బంజారాలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

సమయపాలన పాటించండి



పులగంపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

నల్లమాడ: సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం మండలంలోని దొన్నికోట, పులగంపల్లి సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి హామీ పనులు, చౌకడిపోల్లో రేషన్ పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ అమర్నాథరెడ్డి, ఏపీఓ రఘునాథరెడ్డి, సర్పంచ్‌లు రాగినేని సరస్వతి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాండ్లపెంట: గాండ్లపెంట విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా మరమ్మతులు చేయాల్సి ఉండటంతో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కదిరి ట్రాన్స్‌కో ఏడీ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులు, రైతులు గమనించి, సహకరించాలని కోరారు.

పోషకాహారం తీసుకోవాలి

ఓడీచెరువు : రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాదేవి సూచించారు. ఆమడగూరు మండలం చినగానిపల్లి పంచాయతీ ఆకులవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కృష్ణమ్మ, స్వర్ణమ్మ, స్వాతి, చౌడమ్మ, మమత, పద్మావతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాగు పట్టాలు మంజూరు చేయాలి

ఓడీచెరువు : ఇనగలూరులో ఎస్సీలు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోకుండా స్థానికంగా సాగుభూమి పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా ఇనగలూరు అంబేద్కర్ నగర కాలనీ వాసులు పలువురు సీపీఐలో చేరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చలపతి నాయుడు, రవి కుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు రత్నాబాయి పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలపై ఫ్యాప్టో పోరుబాట

పుట్టపర్తి: రాష్ట్రంలో 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో పోరుబాట పట్టింది. మంగళవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టే ధర్నాకు వైఎస్సార్‌టీఏ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి లీలా ఇంద్ర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్నాలో పాల్గొనేందుకు విజయవాడకు వెళ్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా సమస్యలేవీ పరిష్కరించలేదన్నారు.

చలో విజయవాడకు తరలిరండి

తనకల్లు: సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన 'చలో విజయవాడ'కు తరలిరావాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర కోశాధికారి టి.పుల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధ్యాయుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.